సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 18 । మే । 2024



ఘనంగా క్షీరాభిషేకం

విశాఖ నగరంలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. 10లో



శ్రీవారికి వారాంతపు పూజలు

విశాఖ రుషికొండలోని శ్రీవారి దివ్యక్షేత్రంలో శుక్రవారం వారాంతపు పూజలు ఘనంగా నిర్వహించారు. 10లో



విశేషంగా నిత్య కల్యాణం

సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి నిత్యకల్యాణం శుక్రవారం విశేషంగా నిర్వహించారు. 10లో

అందుబాటులో అత్యవసర వైద్యం

ఒకప్పుడు రిఫరల్ ఆస్పత్రిగా ఉన్న రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అత్యాధునిక వసతులతో అత్యవసర వైద్యం అందుబాటులోకి వచ్చింది. గత మూడేళ్లుగా మెరుగైన వైద్యసేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

- 11 మండలాలకు పెద్దదిక్కుగా రంపచోడవరం ఏరియా ఆస్పత్రి
- పూర్తిస్థాయిలో వైద్యనిపుణులు
- రోగులకు అన్నిరకాల వైద్యసేవలు
- పూర్తిగా తగ్గిన రిఫర్ కేసుల సంఖ్య
- తాజా ఐసీయూ విభాగం ఏర్పాటు



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ విభాగం



ఐసీయూలో వెంటిలేటర్

రంపచోడవరం: స్థానిక ఏరియా ఆస్పత్రి 11 మండలాల ప్రజలకు పెద్దదిక్కుగా మారింది. ఇక్కడి ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి డా. కె లక్ష్మి ప్రత్యేకదృష్టి సారించి వైద్యులు, సిబ్బంది సహకారంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టారు. గతంలో అత్యవసర వైద్యం కోసం వచ్చే కేసులను రాజమహేంద్రవరం, కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రులకు రిఫర్ చేసేవారు. ఈ పరిస్థితుల్లో అంచెలంచెలుగా అత్యాధునిక వైద్యసేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

ఐసీయూ విభాగం ఏర్పాటు

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ విభాగం ఏర్పాటు చేయడంతో అత్యవసర కేసులకు ఇక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. ఐసీయూ విభాగంలో వెంటిలేటర్ అందుబాటులో ఉంది. అత్యవసర వైద్యం కోసం వచ్చిన రోగి శ్వాస తీసుకునేందుకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నప్పుడు కృత్రిమ శ్వాస అందించివచ్చని వైద్యులు తెలిపారు.

కేవలం కార్పొరేట్ ఆస్పత్రిల్లో మాత్రమే ఉండే ఈ సదుపాయం వల్ల రోగుల బంధువులకు అవస్థలు తప్పినట్టే. గతంలో అత్యవసర వైద్యం అందించాలంటే రాజమహేంద్రవరం, కాకినాడ జీజీహెచ్‌కు తరలించేందుకు సుమారు గంటకు పైగా సమయం పట్టేది. వైద్యం అందించాల్సిన కీలకమైన సమయం రోగిని తరలించేందుకే సరిపోయేది. ఎన్నో వ్యయ ప్రయాసలకు గురై ఆస్పత్రికి తీసుకువెళ్లే లోపు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్యంలో వైద్య సేవలను గణనీయంగా మెరుగుపరిచింది. కొత్త పీహెచ్‌సీల ఏర్పాటుతో పాటు ఏరియా ఆస్పత్రులను బలోపేతం చేసింది.
- ఒకప్పుడు రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఒక్క ప్రత్యేక వైద్య నిపుణుడు కూడా లేని పరిస్థితి ఉండేది. అలాంటిది ప్రస్తుతం ఉన్న 16 మంది వైద్యుల్లో 12 మంది నిపుణులు ఉన్నారు. వీరిలో గైనిక్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, కంటి వైద్య శస్త్ర చికిత్స నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు ఉన్నారు. శస్త్రచికిత్స అందుబాటులోకి వచ్చాయి.

దశలవారీగా సౌకర్యాలు



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో దశలవారీగా సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఒకప్పుడు రిఫర్ చేసే పరిస్థితి ఉండేది.ఇప్పుడు ఇక్కడే కీలకమైన సర్జరీలు జరుగుతున్నాయి. ఐసీయూ విభాగం అందుబాటులోకి వచ్చింది. వివిధ పరీక్షలకు సంబంధించి అత్యాధునిక ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది.

– కె లక్ష్మి, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి రంపచోడవరం

వైద్య సేవలు చాలా బాగున్నాయి



రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు చాలా బాగున్నాయి. ప్రసూతి సేవలు కోసం ఆస్పత్రికి వచ్చాం. ఇక్కడ వైద్యం బాగా చేస్తున్నారు. సిబ్బంది ఎంతో బాగా చూసుకుంటున్నారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ఇలాంటి సేవలు అందడం సంతోషం. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– పద్మ, తాటివాడ, రంపచోడవరం మండలం

న్యూస్‌రీల్

పూర్తిస్థాయిలో వైద్యసేవలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే
- ఐసీయూ యూనిట్ ప్రారంభం



ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ యూనిట్‌ను ప్రారంభిస్తున్న పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఐసీయూ (ఇంటెన్సివ్ కేర్ యూనిట్) విభాగం అందుబాటులోకి వచ్చిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే తెలిపారు. ఏరియా ఆస్పత్రిలో ఐసీయూ విభాగాన్ని సూపరింటెండెంట్ డా. కె.లక్ష్మితో కలిసి శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రమాదాలకు గురైనవారితో పాటు విష జ్వరాలు, డెంగ్యూ, మలేరియా సీరియస్ కేసులకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులకు ప్రత్యేకమైన వార్డును ఏర్పాటు చేసి వారికి ఆహారం అందజేస్తున్నామని పీవో తెలిపారు.

మోదకొండమ్మ ఉత్సవ తేదీల మార్పు

- వచ్చేనెల 9 నుంచి నిర్వహణ

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవ తేదీల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత ఈనెల 19, 20, 21తేదీల్లో నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించింది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉత్సవాలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అధికార యంత్రాంగం, పోలీసుశాఖ అనుమతులు ఇవ్వలేదు.144సెక్షన్ అమలులో ఉన్నందున ఉత్సవాలను వచ్చే నెల 9,10,11తేదీలకు మార్పు చేసినట్టు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ప్రకటించారు. ఆలయంలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో తేదీలను నిర్ణయించారు ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు పాల్గొన్నారు.

శ్రీనివాసుడి కల్యాణానికి తరలిరండి



విగ్రహదాత వడ్డి కాసులుకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఆలయ ఈవో బండారు ప్రసాద్

ముంచంగిపుట్టు: కప్పురాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 19న నిర్వహించిన శ్రీనివాసుడి కళ్యాణోత్సవాలకు భక్తులు తరలి రావాలని ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ కోరారు. ఉత్సవం నిర్వహణలో భాగంగా కళ్యాణ ఆహ్వాన పత్రికలను ఆలయంలో శుక్రవారం ఆవిష్కరించి పంపిణీ చేశారు. వైభవుడి విగ్రహదాత వడ్డి కాసులుకు మొదటి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం నిర్మాణకమిటీ, వెల్ఫేర్ కమిటీ సభ్యులకు ఆహ్వాన పత్రికలు అందించారు.

అనారోగ్యంతో యువతి మృతి

చింతపల్లి రూరల్: సికిల్ సెల్ ఎనీమియాతో గత వారం రోజుల నుంచి బాధపడుతున్న యువతి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని బలపం పంచాయతీ తూరుమామిడి గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలిలావున్నాయి. తూరుమామిడి గ్రామానికి చెందిన కోరాబు భూమిక (18) పాడేరు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది.ఆమె గత నాలుగేళ్లుగా సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. గత వారం రోజులుగా పరిస్థితి మరింత విషమంగా మారడంతో నాలుగు రోజుల క్రితం కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ భూమిక గురువారం సాయంత్రం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తండ్రి కోరాబు లక్ష్మీపడాల్, అన్నయ్య కోరాబు మోహన్‌రావు తెలిపారు.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధుల దుర్వినియోగం

- వైద్యాధికారుల తీరుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా
- రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి



వాడపల్లి పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ బందం శ్రీదేవి

రంపచోడవరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అభివృద్ధి కమిటీ నిధులు దుర్వినియోగం అయ్యాయని ఎంపీపీ బందం శ్రీదేవి ఆరోపించారు. శుక్రవారం ఆమె మండలంలోని సీతపల్లి, వాడపల్లి, పెదగెద్దాడ, నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కమిటీ సభ్యులతో కలిసి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆమె రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యుల అనుమతి లేకుండా హెచ్‌డీఎస్ నిధులను వైద్యాధికారులు ఇష్టారాజ్యంగా ఖర్చుచేశారని తెలిపారు. నిధుల ఖర్చుకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్, క్యాష్ బుక్, బ్యాంక్ పాస్ బుక్, బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలు ఏమీ లేవన్నారు. సకాలంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించలేదన్నారు. నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విజయ సునీత, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పెదగెద్దాడ పీహెచ్‌సీలో రోగులకు సరిగ్గా వైద్య సేవలు అందడం లేదని ఆమె ఆరోపించారు. సర్పంచ్ వడల ప్రసాద్‌తో కలిసి ఆస్పత్రిని సందర్శించారు. సమాచార బోర్డుల్లో ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి సంబంధించిన వివరాలు లేవన్నారు. ఎంపీటీసీలు కుంజం వంశీ, బచ్చల మంగయ్యమ్మ పాల్గొన్నారు.

చివరి దశకు జీడిపిక్కల వ్యాపారం



ధారకొండలో జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



ఒడిశా తరలించేందుకు వ్యాన్‌లో లోడ్ చేసిన జీడిపిక్కలు

- పోటీపడి కొనుగోలు చేస్తున్న ఒడిశా వ్యాపారులు
- కిలోకు రూ.100కు పైగా ధర చెల్లింపు

సాక్షి,పాడేరు: జీడిపిక్కల వ్యాపారం చివరిదశకు చేరుకుంది. ఒడిశా వ్యాపారులు గిరి రైతుల నుంచి పోటాపోటీగా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో 58,460 ఎకరాల్లో జీడిమామిడి సాగవుతుండగా ఎకరాకు 300 కిలోల వరకు దిగుబడి వస్తుండగా రూ.30 వేల వరకు ఆదాయం పొందుతున్నారు. దిగుబడి తగ్గినపపటికీ సీజన్ ప్రారంభంలో గిట్టుబాటు ధర లేక రైతులు నిరాశకు గురయ్యారు. ఈ సీజన్‌లో కిలో రూ.80 నుంచి రూ.100 లోపే విక్రయాలు జరిగాయి. కొయ్యూరు, రాజవొమ్మంగి ప్రాంతాల్లో సీజన్ ప్రారంభం నుంచి కిలో రూ.90లోపే వ్యాపారులు కొనుగోలు చేశారు. దీంతో ఆ ప్రాంత రైతులు ఆదాయం కోల్పోయారు. పాడేరు మండలం వంట్లమామిడి, చింతపల్లి, అరకులోయ ప్రాంతాల్లో మాత్రం కిలో రూ.100కు కొనుగోలు చేయడం రైతులకు ఊరటనిచ్చింది. ఒడిశాకు సరిహద్దులో ఉన్న దుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, మోతుగూడెం, ధారకొండ ప్రాంతాల్లో ఒడిశా వ్యాపారులు కిలో రూ.100 నుంచి రూ.110కు కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.


సీజన్ ప్రారంభంలో నష్టం



జీడిపిక్కల సీజన్ ప్రారంభంలో విక్రయించడం వల్ల నష్టపోయాను. కిలో రూ.84కు విక్రయించా. ఇప్పుడు రూ.100కు పైగా ధర ఉంది. ఇప్పుడు విక్రయించిన రైతులు మంచి ఆదాయం పొందుతున్నారు.

– డి.కనకరాజు, జీడిరైతు, చింతలపూడి, కొయ్యూరు మండలం

తారబు సోయగం



ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల సరిహద్దులోని ప్రకృతి అందాల మధ్య తారబు జలపాతం ఎంతగానో ఆకట్టుకుంటోంది. పాల నురగలను తలపిస్తూ మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ అందాలను తిలకించేందుకు విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, జైపూర్, ఒడిశా నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. జలపాతంలో స్నానాలు చేస్తూ వేసవితాపం నుంచి ఉపశమనం పొందుతూ ఉత్సాహంగా గడుపుతున్నారు. – ముంచంగిపుట్టు

ప్రశాంతంగా కౌన్సెలింగ్

కొమ్మాది (విశాఖ): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ ఆధ్వర్యంలో నడుస్తున్న డా. బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లాల గురుకుల సమన్వయకర్త ఎస్. రూపావతి తెలిపారు. మొత్తం ఏడు గురుకుల బాలికల కళాశాలలు కలిపి అన్ని గ్రూపుల నుంచి 188 ఖాళీలు పూర్తిస్థాయిలో భర్తీ అయినట్లు తెలిపారు.

మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం సందర్శన

జనరేటర్లను పరిశీలించిన ఏపీ జెన్‌కో డైరెక్టర్ సత్యనారాయణ



మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో జనరేటర్లను పరిశీలిస్తున్న ఏపీ జెన్‌కో డైరెక్టర్ సత్యనారాయణ

ముంచంగిపుట్టు: ఆంధ్రా– ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని శుక్రవారం ఏపీజెన్‌కో డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ సందర్శించారు. వించ్ మార్గంలో విద్యుత్ కేంద్రానికి చేరుకున్నారు. ప్రాజెక్టు ఆధునికీకరణకు నిర్వహిస్తున్న జనరేటర్ల సామర్థ్య పరీక్షలను ఆయన పరిశీలించారు. జనరేటర్ల ఉత్పత్తి, వినియోగం వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కంట్రోల్ రూంలో అధికారులతో సమావేశం అయ్యారు. ప్రాజెక్టులో నెలకొన్న పరిస్థితులను తెలుసుకున్నారు. ప్రస్తుతం జోలాపుట్టు, డుడుమ జలాశయాల్లో నీటి నిల్వలు అడుగంటిన నేపథ్యంలో తీసుకుంటున్న చర్యలపై స్థానిక అధికారులతో చర్చించారు. అనంతరం సీలేరు కాంప్లెక్స్‌కు నీటిని అందించే జోలాపుట్టు జలాశయాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో సీలేరు కాంప్లెక్స్ సీఈ బొడ్డుశ్రీధర్, ఎస్‌ఈ సివిల్ కేకేవీ ప్రశాంత్‌కిశోర్, ఎస్‌ఈ హెచ్‌పీసీ స్వామినాయుడు, ఎస్‌ఈ విద్యుత్‌సౌధ చంద్రశేఖర్ రెడ్డి, మాచ్‌ఖండ్ ఎస్‌ఈ ఏవీ సుబ్రమణ్యేశ్వరరావు, ఈఈ జనరేషన్ బి.గోవిందరాజులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు పటిష్ట చర్యలు

జిల్లా అధికారి ప్రసాదరావు



తాంగులలో మలేరియా నివారణ మందు పిచికారీని పరిశీలిస్తున్న జిల్లా అధికారి ప్రసాదరావు

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు పటిష్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నట్టు జిల్లా మలేరియా అధికారి ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని కరిముఖిపుట్టు పంచాయతీ తాంగుల గ్రామంలో మలేరియా నివారణ మందు పిచికారీ పనులను పరిశీలించారు. పిచికారీకి సిద్ధం చేసిన మలేరియా నివారణ మందు మోతాదు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని గిరిజనులతో మాట్లాడారు. వీధుల్లో మురుగు, చెత్త నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఇంటి బయట, లోపల మందును పిచికారీ చేయించుకోవాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దోమల నివారణ మందు తొలివిడత పిచికారీ చురుగ్గా జరుగుతోందన్నారు. మండలంలో 128 గ్రామాల్లో తొలివిడత పిచికారీ జరుగుతోందన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నిరోధించేందుకు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శేషయ్య, మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ధీరజ్

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లి ఉత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.విజయసునీత కోరారు. ఇందుకు సంబంధించి అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే నెల 9,10,11తేదీల్లో నిర్వహించే ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. ఉత్సవాల మూడు రోజులు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, 24గంటల పాటు వైద్యబృందాలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలని,ప్రైవేట్ జీపులకు సంబంధించి ఓవర్‌లోడ్ ఉండకూడదన్నారు. రెండు అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలని, విద్యుత్ సమస్యలు లేకుండా ముందస్తుగానే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుహిన్‌సిన్హా, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, పాడేరు ఏఎస్పీ ధీరజ్, డీఆర్వో పద్మావతి, ఉత్సవ కమిటీ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు, వెంకటరమణ,యాదగిరి శ్రీను పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత ఆదేశం



స్ట్రాంగ్ రూమ్ వద్ద జిల్లా ఎన్నికల అధికారి విజయ సునీత, ఎస్పీ తుహిన్ సిన్హా, రిటర్నింగ్ అధికారులు



ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న విజయ సునీత, చిత్రంలో ఎస్పీ తుహిన్ సిన్హా

సాక్షి,పాడేరు: సార్వత్రిక ఎన్నికల లెక్కింపునకు సంబంధించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాడేరు, అరకులోయ స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ తుహిన్‌సిన్హా, అరకు ఆర్వో వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఏఎస్పీ ధీరజ్‌తో కలిసి తనిఖీ చేశారు. భద్రత చర్యలను పరిశీలించారు. అనంతరం వచ్చే నెల నాల్గో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునుకు సంబంధించిన గదులను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల్లోపూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని, అభ్యర్థులు, ఏజెంట్ల పరిశీలనకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. బారికేడ్లు నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్లు,ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు,డీఈఈ అనుదీప్,పాడేరు సీఐ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖ జైల్ రోడ్‌లో నిర్వహించే బాలికల జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థునులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే. విజయ తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులను ఇంగ్లిషు, తెలుగు మీడియంలో బోధన సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థినులు వెంటనే కాలేజీలో సంప్రదించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడి వారైనా కాలేజీలో చేరవచ్చన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు.

మల్లెలు కావు.. కాఫీ పూలు



మన్యంలో వాతావరణ పరిస్థితులు కాఫీతోటలకు అనుకూలించాయి. మల్లెలను తలపించేలా పూలతో కళకళలాడుతున్నాయి. జీకేవీధి మండలంలోని లంకపాకలు వద్ద రోడ్డును ఆనుకుని విరబూసిన కాఫీ తోటలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. – సాక్షి,పాడేరు

వేరుశనగ సాగు..
లాభాలు బాగు


పెదబయలు మత్స్యగెడ్డ సమీపంలో పండిస్తున్న వేరుశనగ సాగు

- ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం
- విత్తనాల పంపిణీ
- జోరుగా వేసవి దుక్కులు

పెదబయలు: గిరిజన ప్రాంత రైతులు సంప్రదాయ పంటలు పసుపు, పిప్పళ్ల పంటలు పండిస్తూనే ఖరీఫ్ వరి సాగుపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు.అలాగే వాణిజ్య పంటలపై మండలంలోని సీతగుంట, అరడకోట, అడుగులుపుట్టు, గలగండ, గంపరాయి, ముంచంగిపుట్టు మండలం దారెల, పెదగుడ, ఏనుగురాయి, మాకవరం, దోడిపుట్టు పంచాయతీల్లో ఎక్కువగా వాణిజ్య పంటలు వేరుశనగలు మండలంలో 650 హెక్టార్లలో సాగుచేస్తున్నారు. మన్యంలో పండించే వేరుశనగలకు మార్కెట్‌లో మంచి ధర ఉంది. దీంతో రైతులు గత రెండేళ్ల నుంచి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. మండలంలోని సీతగుంట, అడుగులపుట్టు పంచాయతీల్లో వందల ఎకరాల్లో మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది మరింతగా సాగు విస్తరించారు.

సబ్సిడీపై విత్తనాలు

మండలంలోని ఖరీఫ్ వరి, సామలు, రాగుల పంటలకు సంబంధించి రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. మెట్ట పంటలు సామలు, రాగులు, కొర్రలు ఇతర పంటలకు సంబంధించి పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ వరి కోసం దుక్కులు దున్నుతున్నారు. అలాగే ఇటీవల ప్రభుత్వం సబ్సిడీ పసుపు విత్తనాలు అందించడంతో రైతులు నాటుతున్నారు. వేసవి దుక్కుల వల్ల ఎంతో ప్రయోజం ఉంటుందని, కలుపు నివారణలో వర్షం పడితే నీటిని ఎక్కువ పీల్చుకుంటుందని, సేంద్రియ ఎరువులు వేసిన ఎక్కువగా భూమిలో కలుస్తుందని వేసిన పంట బాగా దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు.

వాతావరణం అనుకూలం

వేరుశనగ పంట బాగుంది.ఈ ఏడాది మొక్కలు బాగుంది. దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మరో రెండు నెలల్లో పంట చేతికందే అవకాశం ఉంది. గత ఏడాది ధర బాగానే ఉంది.ఈ ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉందని ఆశగా ఉంది. ఈ ఏడాది మే నెలలో కూడా వర్షాలు పడుతుండడంతో వాతావరణం సాగుకు అనుకూలంగా ఉంది.

– చిట్టపులి సూరిబాబు,
రైతు, సీతగుంట గ్రామం

లేపాక్షి రకం విత్తనాల పంపిణీ



గత ఏడాది చింతపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి లేపాక్షి రకం వేరుశనగ విత్తనాలు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా మండలంలోని సీతగుంట పంచాయతీలో రోగులపేట, చిట్రాయిపుట్టు రైతులకు పంపిణీ చేశాం. గతేడాది సీతగుంట పంచాయతీలో సుమారు 350 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు. దీంతో పాటుగా అడుగులపుట్టు, సీకరి, అరడకోట, గలగండ, గంపరాయి, పెదకోడాపల్లి పంచాయతీల్లో సాగు చేస్తున్నారు. 90 రోజుల వేసవి పంటకు రైతులకు మంచి దిగుబడి వస్తుంది. ఎక్కువగా నీరు అందుబాటులో ఉన్న ఇసుక నేలల్లో సాగుకు అనుకూలంగా ఉంది.గత ఏడాది కంటే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

– ఏ.శ్రీనివాస్,
మండల వ్యవసాయ అధికారి,పెదబయలు మండలం.

అపురూపం..
చరిత్రకు సాక్ష్యం

- ఏయూ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల పరిధిలో మ్యూజియంలు
- విద్యార్థులకు ప్రత్యక్ష జ్ఞానాన్ని అందించే కేంద్రాలు
- నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం


వృక్షశాస్త్ర మ్యూజియంను సందర్శిస్తున్న విదేశీయులు(ఫైల్)


హెర్బేరియంలో ఎండిన రూపంలో మొక్కలు


వృక్షశాస్త్రంలో విత్తనాలను నిల్వచేస్తున్న విధానం


మ్యూజియంలో చిరుత కళేబరం

ఏయూక్యాంపస్: కళాఖండాలు.. చారిత్రక వస్తువులు.. శాస్త్రీయ నమూనాల వంటి వస్తువులను సేకరించి ప్రదర్శించే ప్రదేశం మ్యూజియం. ప్రజలు తిలకించడానికి, అధ్యయనం చేయడానికి ఈ కళాఖండాలు అందుబాటులో ఉంటాయి. నేడు అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం. మ్యూజియంలు సమాజానికి ఎలా దోహదపడతాయనే దాని గురించి అవగాహన కల్పించడం, సాంస్కృతిక మార్పిడి, వైవిధ్యం, సమగ్రతను ప్రోత్సహించడం ఈ డే ఉద్దేశం. ఈ సందర్భంగా ఏయూ సైన్స్, ఆర్ట్స్ కళాశాలల పరిధిలోని పలు మ్యూజియం విశేషాలు తెలుసుకుందాం.

◆ ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ప్రధానమైన విభాగాల్లోని వృక్షశాస్త్రం ఒకటి. ఈ విభాగానికి సంబంధించి మ్యూజియం, హెర్బేరియం ఉన్నాయి. సహజంగా ఉండే మొక్కలు, విత్తనాలు ఫార్మాడీహైడ్‌లో భద్రపరిచి ఇక్కడ ప్రదర్శనలో ఉంచారు. ఇక్కడ 500లకు పైగా సముద్ర తీరం, అడుగు భాగంలో లభించే మొక్కలు, నేలపై లభించే మొక్కలు, విత్తనాలు వంటివి విద్యార్థుల కోసం భద్రపరిచారు. వీటితో పాటు వివిధ జాతుల అరుదైన చెక్కలు, అరుదైన వృక్ష శిలాజాలు కూడా ఇక్కడ ఉన్నాయి. అలాగే హెర్బేరియంలో 25 వేలకు పైగా నమూనాలు ఉన్నాయి.

◆ ఏయూలోని జీవశాస్త్ర విభాగంలోని మ్యూజియంలో సుమారు 1,500లకు పైగా జీవులకు సంబంధించిన నమూనాలు ఉన్నాయి. చిరుత, జింక, తాబేలు, పక్షులు, పాములు ఇలా అనేక జీవుల కళేబరాలను టాక్సీ డమ్మీ విధానంలో ప్రత్యేక రసాయనాలు ఉపయోగించి ఇక్కడ భద్రపరిచారు. నేలపై, నీటిలో, గాలిలో సంచరించే అన్ని జీవుల కళేబరాలు మనకు దర్శనమిస్తాయి. అరుదైన, అంతరించే జీవులను కూడా ఇక్కడ మనం చూసే అవకాశం ఉంది.

◆ ఆర్ట్స్ కళాశాల పరిధిలోని ఆంత్రపాలజీ విభాగంలో ప్రత్యేకంగా మ్యూజియం ఉంది. మానవ పరిణామ క్రమాన్ని వివరించడం, ప్రజల జీవనం తెలిపే విధంగా ఈ మ్యూజియంను తీర్చిదిద్దారు. ప్రాచీన కాలంలో ఉపయోగించిన పనిముట్లు, వారి సంస్కృతి, కళలు, జీవన విధానం, అలంకరణ వస్తువులు వంటివి ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇటీవల ఏయూను సందర్శించిన నాక్ నిపుణుల బృందం సైతం వీటిని పరిశీలించి ప్రశంసించింది.

◆ గత చరిత్రను మన ముందుంచే విధంగా చరిత్ర విభాగంలో మ్యూజియం ఉంది. ఇక్కడ చారిత్రక నాణేలు, ఇనుప రేకులపై రాసిన శాసనాలు, చారిత్రక శిలలు, శిల్పాలు, చారిత్రక ఆనవాళ్లుగా నిలిచే అనేక వస్తువులను ఇక్కడ భద్రపరిచారు. భారతీయ ఆలయాలు, శిల్ప సంస్కృతులను తెలిపే చిత్రాలు ఇక్కడ మనకు కనిపిస్తాయి. కాగా.. చారిత్రక సంపదను చెక్కు చెదరకుండా భద్రపరచడం ఎంతో క్లిష్టమైన అంశం. ఈ విషయంలో ఏయూ అధికారులు ఎంతో శ్రద్ధ చూపుతున్నారు. శతాబ్దానికి చేరువవుతున్న ఏయూకు ఈ మ్యూజియం అదనపు ఆభరణాలు.


చరిత్ర విభాగంలో భద్రపరిచిన శిల్పాలు





జువాలజీ విభాగంలోని మ్యూజియంలో వివిధ జంతువుల కళేబరాలు


మ్యూజియంలో హైనా, అలుగు జంతువుల కళేబరాలు

ఘనంగా క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

మరికొన్ని రైళ్ల రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా ఆయా స్టేషన్ల నుంచి బయలుదేరాల్సిన పలు రైళ్లను రీషెడ్యూల్ చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. బెంగళూరులో శుక్రవారం ఉద యం 10.15 గంటలకు బయలుదేరాల్సిన వీటీ బెంగళూరు-అగర్తలా(12503)హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-ఎస్ఎంవీ బెంగళూరు (08845) రాత్రి 12.30 గంటలకు బయలుదేరింది.

◆ శుక్రవారం ఉదయం 5.45గంటలకు విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖ- సికింద్రాబాద్(20833) వందేభారత్ సుమారు 3 గంటలు ఆలస్యంగా 8.45 గంటలకు బయలుదేరింది. సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం 3 గంలకు బయలుదేరాల్సిన సికింద్రాబాద్-విశాఖ(20834) 2.15 గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22807)ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఆరు గంటలు ఆలస్యంగా రాత్రి 11.55 గంటలకు బయలుదేరింది.

◆ సంత్రగచ్చిలో శుక్రవారం రాత్రి 11.40 గంటలకు బయలుదేరాల్సిన సంత్రగచ్చి-తాంబరం (06090) స్పెషల్ సుమారు నాలుగున్నర గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారు 4 గంటలకు బయలుదేరింది.

◆ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలుదేరాల్సిన ఎంజీఆర్ చెన్నై సెంట్రల్- హౌరా (12840) సూపర్‌ఫాస్ట్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు గంటన్నర ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరింది.

ఈ రైళ్లు అంతే ఆలస్యంగా ఆయా స్టేషన్లకు రాకపోకలు సాగించనున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారులు కోరారు.

విశేషంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

శ్రీవారికి వారాంతపు పూజలు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు శేషవస్త్రాన్ని, అభిషేక సామాగ్రిని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకువెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు


అసరాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలం అసరాడ తోటమామిడి వద్ద శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి నుంచి కొయ్యూరు వెళ్తున్న మొట్టడం జీవన్ , పాంగి దారబాబులు పెదవలస నుంచి చింతపల్లి వస్తున్న పాంగి చిరంజీవి, రాశికుమారి, అన్నపూర్ణలు ద్విచక్రవాహనాల్లో వస్తుండగా ఇరువురి వాహనాలు ఎదురెదురుగా వచ్చి అదుపుతప్పడంతో అసరాడ సమీపంలోని ప్రధాన రహదారిపై ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. వీరిని స్థానికులు హుటాహుటిన చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం పాడేరు, నర్సీపట్నం ఆసుపత్రులకు రిఫర్ చేశారు.

మరికొన్ని సమ్మర్ స్పెషల్స్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మరికొన్ని వన్‌వే సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ప్రకటనలో తెలిపారు. భువనేశ్వర్-సోలాపూర్(01452) వన్ వే సమ్మర్ స్పెషల్ ఈ నెల 20 సోమవారం ఉదయం 4.30 గంటలకు బయలుదేరి అదే రోజు ఉదయం 11.43 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.45 గంటలకు బయలుదేరి మంగళవారం ఉదయం 7 గంటలకు సోలాపూర్ వెళ్తుంది. భువనేశ్వర్-ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి (01056) వన్‌వే సమ్మర్ స్పెషల్ ఈ నెల 20 సోమవారం రాత్రి 11 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 6.45 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.53 గంటలకు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.15 గంటలకు ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి వెళ్తుంది.

సమన్వయలోపంతో 'షాక్'!

- బలవుతున్న విద్యుత్ ఉద్యోగులు
- మరమ్మతుల సమయంలో సమాచార లోపం
- సరఫరా నిలిపివేయడంలో జాప్యం కారణంగా ప్రమాదాలు
- రెండు నెలల్లో ఇద్దరు ఈపీడీసీఎల్ ఉద్యోగుల మృతి
- విశాఖ సర్కిల్‌లో ఈపీడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం




గాలి భీమవరంలో మృతి చెందిన హెల్పర్ వెంకట రమణ(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం :

● ఏప్రిల్ 25న మునగపాక మండలం చూచుకొండలో విద్యుత్ సమస్యని పరిష్కరిస్తుండగా షాక్‌కు గురై ఈపీడీసీఎల్ హెల్పర్ పీతల శివన్నారాయణ మృతి చెందారు.

● ఈ నెల 16న సబ్బవరం మండలం గాలి భీమవరంలో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ఈపీడీసీఎల్ హెల్పర్ గొంప వెంకటరమణ షాక్‌కు గురై మృత్యువాత పడ్డారు.

పై రెండు మరణాలకు విద్యుత్ అధికారుల మధ్య సమన్వయలోపమే ప్రధాన కారణమన్నది స్పష్టమవుతోంది. మరమ్మతుల సమయంలో సమాచార జాప్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నాయి. విధి నిర్వహణలో సక్రమంగా వ్యవహరించాల్సిన ఇంజినీరింగ్ సిబ్బంది.. వసూళ్లపైన మాత్రమే దృష్టి సారిస్తుండటంతో తరచుగా ప్రమాదాలు పెరుగుతూ వస్తున్నాయి. వరుసగా రెండు నెలల్లో ఇద్దరు ఈపీడీసీఎల్ సిబ్బంది మృత్యువాత పడటానికి కారణం.. విశాఖ సర్కిల్ అధికారులు నిర్లక్ష్యమేనన్నది స్పష్టమవుతోంది.

ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే.. సంబంధిత లైన్‌మెన్ హెల్పర్ సహాయంతో మరమ్మతులు చేస్తారు. ఈ సమయంలో సబ్ స్టేషన్‌కు ఫోన్ చేసి.. ఫలానా ఏరియాకు సంబంధించిన విద్యుత్ సరఫరా నిలిపివెయ్యాలని చెబుతుంటారు. వీధుల్లో సమస్య తలెత్తితే.. సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి సరఫరా నిలిపేస్తారు. ఇక్కడే సిబ్బంది వహిస్తున్న నిర్లక్ష్యం వారి పాలిట యమపాశంలా మారిపోతోంది. లోపం తలెత్తిన లైన్ మరమ్మతులు పూర్తయ్యాయా లేదా.? అనే అంశంపై స్పష్టత రాకుండానే విద్యుత్ సరఫరా ఇచ్చేస్తుండటం వల్ల ఈ ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి.

ప్రతి నెలా ప్రమాదమే..

కేవలం ఈపీడీసీఎల్ సిబ్బంది మాత్రమే కాకుండా.. తరచూ ఏదో ఒక చోట విద్యుదాఘాతాలు సంభవిస్తున్నాయి. ఏప్రిల్ 14న అచ్యుతాపురం మండలం కొండకర్లలో విద్యుదాఘాతానికి గురై ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందగా.. మార్చిలో గాజువాకలో విద్యుత్ వైర్లు తగిలి ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. పీఎం పాలెంలో ఓ భవనంలో ప్లంబింగ్ చేస్తుండగా.. ప్రమాదానికి గురై వ్యక్తి మృత్యువాత పడ్డారు. ఇలా ప్రతి చోటా ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు మాత్రం చలనం లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజల్లో విద్యుత్ ప్రమాదాలపై కనీస అవగాహన చేయలేకపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం

ప్రమాదాల నివారణకు సంబంధించి విశాఖపట్నం ఈపీడీసీఎల్ సర్కిల్ అప్రమత్తంగా వ్యవహరించడంలో నిర్లక్ష్యంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సబ్బవరం ప్రాంతంలో ఈపీడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు రైతుల వద్ద నుంచి విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.లక్షల్లో వసూళ్లపై మాత్రమే దృష్టి సారిస్తున్నారు తప్ప.. లైన్ల పరిశీలన, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రత.. తదితర అంశాల్ని మాత్రం పూర్తిగా విస్మరిస్తున్నారు. ఎవరైనా.. విద్యుత్ కనెక్షన్ కావాలంటే.. కచ్చితంగా జేబులు నింపాల్సిందేనన్నట్లుగా అడ్డగోలుగా వ్యవహిస్తున్నారు. ఉన్నతాధికారులకు సైతం డబ్బులు ముట్టజెప్పాలంటూ రైతులు, వినియోగదారుల్ని ముప్పతిప్పలు పెడుతున్నారే తప్ప.. విద్యుత్ వ్యవస్థని సరిదిద్దే ఆలోచన మాత్రం.. ఈపీడీసీఎల్ విశాఖసర్కిల్ ఇంజినీరింగ్ అధికారుల్లో మాత్రం కనబడటం లేదన్నది ఈ మధ్య కాలంలో జరుగుతున్న ప్రమాదాల ద్వారా స్పష్టమవుతోంది.